# మాటలూ - చేతలూ

— డా॥ జె. వీరాస్వామి

రాము ఊరిలో చాలా హడావుడిగా ఉంది. ఏమిటా అని ఆ వేపు నడిచాడు రాము.

ఒక పెద్ద వేదిక కనబడింది. ఆ వేదిక రంగు రంగుల కాగితాలతో, పచ్చని తోరణాలతో అలంకరించి వుంది. జాతీయ పతాకం రెప రెప లాడుతూంది.

ఎదురుగా మంత్రిగారికి స్వాగతం బోర్డు కనబడ్డది.

మంత్రిగారు ఏమి చెప్తారో నని కుతూహలంగా అంతా విన్నాడు, రాము. మంత్రిగారి ఉపన్యాస సారాంశం ఇది. — "నన్ను ఎప్పుడయినా కలుసుకోవచ్చు. నన్ను మంత్రిగా చూడొద్దు. మీలో ఒకడిగానే నన్ను చూడండి. నా సాయం తప్పక మీకు లభిస్తుంది."

ఆ ఉపన్యాసం విన్నాక, తన చెవుల్ని తనే నమ్మలేక పోయాడు. తన రొట్టె విరిగి నేతిలో పడ్డదనుకున్నాడు. ఆడబోయిన తీర్థం ఎదురయిందనుకున్నాడు.

రాము తనకున్న రెండు ఎకరాలు అమ్ముకొని, బి. ఏ. ప్యాస్ అయ్యాడు. ఇంకా అమ్మటానికేమి లేదు.

రాము తల్లి బాధతో ఒక రోజు కొడుకు దగ్గరకు వెళ్ళి "నాయనా, ఉన్నదంతా అమ్మి పెద్ద చదువు చదివావు. ఇక ఉద్యోగం వస్తే, మన బాధలు తగ్గుతాయి. పట్నం వెళ్ళి ప్రయత్నించు" అన్నది.

రాముకి మంత్రిగారి ఉపన్యాసం గుర్తొచ్చింది.

"రాము పట్నానికి బయలుదేరాలి. ఉద్యోగం సంపాదించాలి. రాముకు డబ్బు ఇవ్వాలి" అనుకుంది తల్లి. తన మెడలోని చిన్న బంగారు గొలుసు అమ్మింది. ఆ డబ్బును రాము చేతిలో పెట్టింది. దాంతో ఆమె శని వదిలింది, అనుకుంటూ, రామును దీవించి పంపించింది.

రాము చాల ఉత్సాహంగా, ఉల్లాసంగా పట్టణం చేరాడు. నేరుగా మంత్రిగారి కార్యాలయం చేరాడు.

ఒక తెల్లని చీటిమీద తన విలాసం, సందర్భం రాసి లోనికి పంపాడు.

మంత్రిగారు నవ్వుతూ "చాల సంతోషం బాబు. మా పి. ఏ.ని పోయి చూడు." అని చెప్పారు.

రాము పట్టరాని సంతోషంతో., ఉద్యోగం తన చేతిలోకి ఊడిపడిందనుకుంటూ, పి. ఏ. గారిని సందర్శించాడు.

పి. ఏ. గారు చాల సూక్ష్మగ్రాహి. స్థూలకాయుడయినప్పటికిని, రాముని మీదనుంచి కిందదాకా పరీక్షించాడు. బయటకు దారి చూపాడు.

రాము- అర్థం కాలేదు. మీకు అర్థం అయింది కదా : బాలు !!

★